క్లుప్తంగా

గురుకుల విద్యార్థులకు ట్రిపుల్ ఐటీలో సీట్లు

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని పెద తాడేపల్లి డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాలకు చెందిన ఇరువురు విద్యార్థులు ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించారు. బర్రే ప్రకాష్ నూజివీడు, టీకు కుమార్ శ్రీసత్యసాయి శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీలో సీట్లు లభించాయని ప్రిన్సిపల్ బి.రాజారావు గురువారం తెలిపారు. ఈ సందర్భంగా వారిని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్, గురుకుల పాఠశాలల డీసీవో భారతి, ప్రిన్సిపల్ బి.రాజారావు అభినందించారు.

బాలికలను ఉన్నతంగా చదివించాలి

తాడేపల్లిగూడెం రూరల్: బాలికలను ఉన్నతంగా చదివించాలని, బాల్య వివాహాలు చేయరాదని మారంపల్లి సర్పంచ్ సరిపల్లి చిట్టిబాబు అన్నారు. గురువారం మండలంలోని మారంపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో మొక్కలు నాటే కార్యక్రమం, సేవ్ గాల్ చైల్డ్ పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ చిట్టిబాబు మాట్లాడుతూ బాలికల చదువు రాష్ట్రానికి వెలుగునిస్తుందన్నారు. స్త్రీ, పురుషులు అనే తేడా లేకుండా తల్లిదండ్రులు ఇరువురిని చదివించాలన్నారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రం ఆవరణలో మొక్కలు నాటారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కే.శ్రీదేవి, అంగన్‌వాడీ వర్కర్ పద్మావతి, కూటమి నాయకులు కనకారావు, ఉపాధ్యాయులు టి.అన్నపూర్ణ, కే.బంగారం, ఎంపీపీ స్కూలు టీచర్ బి.రమణ, వైద్య, డ్వాక్రా సిబ్బంది పాల్గొన్నారు.

జాబ్ మేళాలో 21 మంది ఎంపిక

తణుకు టౌన్: తణుకులోని శ్రీ చిట్టూరి ఇంద్రయ్య మెమోరియల్ ప్రభుత్వ డిగ్రీ అటానమస్ కళాశాల జేకేసీ ఆధ్వర్యంలో బీటీఎస్ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ నిర్వహించిన జాబ్ మేళాలో 21 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ పీ అనిల్ కుమార్ తెలిపారు. గురువారం కళాశాలలో నిర్వహించిన జాబ్ మేళాలో బీటీఎస్ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ తమ సంస్థకు అవసరమైన సిబ్బంది నియామకం కోసం ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ మేళాలో కళాశాలకు చెందిన 21 మంది విద్యార్థులు వివిధ ఉద్యోగాలకు ఎంపికైనట్లు తెలిపారు.

సీసీ రోడ్ల నిర్మాణాలకు శంకుస్థాపనలు

తాడేపల్లిగూడెం: ప్రజా ప్రభుత్వస్థాపనే ధ్యేయంగా పనిచేస్తామని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాసు అన్నారు. గురువారం పలు కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. గణేష్ నగర్ నుంచి నిట్, శశి ఇంజనీరింగ్ కళాశాల మీదుగా హైవే బైపాస్ వరకు వెళ్లే సీసీ రోడ్డు నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. ఛాంబర్ ఆఫ్ కామర్స్‌లో నిత్యావసర వస్తువుల తగ్గింపు విక్రయ కేంద్రాన్ని ప్రారంభించారు. తెదేపా కన్వీనర్ వలవల బాబ్జీ, బీజేపీ నాయకులు ఈతకోట తాతాజీ, తదితరులు పాల్గొన్నారు.

కౌలు రైతు కార్డులను పొందాలి


ఆర్ఎస్.ప్రసాద్

తాడేపల్లిగూడెం రూరల్: కౌలు రైతులు కౌలు గుర్తింపు కార్డులను పొందాలని మండల వ్యవసాయాధికారి ఆర్ఎస్.ప్రసాద్ సూచించారు. గురువారం తాడేపల్లిగూడెంలో ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. 2024-25 సంవత్సరానికి గాను 7,980 కౌలు గుర్తింపు కార్డులు ఇవ్వాలని లక్ష్యంగా నిర్దేశించినట్లు ఆయన తెలిపారు. కౌలు గుర్తింపు కార్డులు ఉన్న రైతులకు పంట నష్టం, వ్యవసాయ యాంత్రీకరణ, రాయితీపై విత్తనాలు పొందవచ్చన్నారు. గత ఏడాది కౌలు గుర్తింపు కార్డులు పొందిన కౌలు రైతులు రెన్యువల్ చేయించుకోవాలన్నారు. సర్వే నెంబరుపై కాకుండా ల్యాండ్ పార్సిల్ నెంబరుపై ఇస్తారన్నారు. కౌలు గుర్తింపు కార్డు కావలసిన రైతులు సమీపంలోని వీఆర్వోను, రైతు సేవా కేంద్రం ఇన్‌చార్జ్‌లను సంప్రదించాలన్నారు.

తల్లికి వందనంలో నిబంధనల మెలిక

- తల్లికి వందనం ఒక్కరికే అంటూ ఇచ్చిన జీఓపై మహిళల మండిపాటు
- అధికారంలోకి వచ్చాక మాట తప్పడంపై ఆగ్రహం

కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక మహిళలకి తొలి షాక్ తగిలింది. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఇంట్లో ఎంత మంది పిల్లలు ఉంటే అంత మందికి రూ.15 వేల చొప్పున తల్లికి వందనం అమలు చేస్తామని చెప్పిన చంద్రబాబు నాయుడు అధికారంలోకి వచ్చాక మాట తప్పారు. కుటుంబానికి ఒక్కరికే తల్లికి వందనం అమలు చేస్తామని జీఓ విడుదల చేయడంపై మహిళలు మండిపడుతున్నారు. ముఖ్యంగా మంత్రి నిమ్మల రామానాయుడు ఎన్నికల ప్రచారంలో భాగంగా చెప్పిన మాటలను యువత సోషల్ మీడియాలో షేర్ చేస్తూ కూటమి ప్రభుత్వ తీరును ప్రశ్నిస్తున్నారు. అలాగే తల్లికి వందనం ఎప్పటి నుంచి అమలు చేస్తారని ప్రశ్నిస్తున్నారు. – సాక్షి నెట్‌వర్క్


తరగతి గదిలో చదువుకుంటున్న విద్యార్థినులు (ఫైల్)

ఇది సరికాదు



ఎన్నికల సమయంలో చంద్రబాబు అమ్మకు వందనం పేరుతో ఇంట్లో ఎంత మంది పిల్లలున్నా ఒక్కొక్కరికి రూ.15వేలు ఇస్తామని హామీ ఇచ్చారు. ఇప్పుడు ఒక్కరికే అన్నట్టుగా చెబుతున్నారు. ఇది సరైంది కాదు. మా ఇంట్లో ఇద్దరు పిల్లలున్నారు. ఇద్దరికి ఇవ్వాల్సిందే. – వి.సురేఖ తాడేపల్లిగూడెం

అన్న మాటను నిలబెట్టుకోవాలి



ఇంట్లో ఎందరు బిడ్డలున్నా, అమ్మకు వందనం పేరిట ఆ బిడ్డలకు ఏటా రూ.15 వేలు ఇస్తామన్నారు. మరి ఒక బిడ్డకే ఇస్తామన్నట్టుగా మాటలున్నాయి. అన్న మాటను నిలబెట్టుకోవాలి. మా బిడ్డలకు అమ్మకు వందనం సొమ్ములు వేయాలి. – ఏ.అరుణకుమారి, తాడేపల్లిగూడెం

బాబు ఇది తగునా

ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు నెరవేర్చాల్సిందే. అమ్మకు వందనం ఇంటిలో బడికి వెళ్లే పిల్లలు ఎంత మంది ఉంటే అంతమందికి అన్నారు. ఆ విధంగా వేయాలి. మాట నిలబెట్టుకోవాలి. – గుర్రం కనకమ్మ, తాడేపల్లిగూడెం

సర్కారు ఆస్పత్రి వైద్యుల సేవలకు అవార్డులు

- కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్సల్లో తణుకు వైద్యులు ఫస్ట్..
- తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రి వైద్యులకు దక్కిన పురస్కారం..


భీమవరంలో తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అరుణకు అవార్డు ఇస్తున్న జిల్లా కలెక్టర్ సి.నాగరాణి


భీమవరంలో తణుకు పీపీ యూనిట్ వైద్యాధికారి డాక్టర్ దుర్గామహేశ్వరరావుకు అవార్డు అందజేస్తున్న జిల్లా కలెక్టర్ సి.నాగరాణి

తణుకు అర్బన్: సర్కారు ఆస్పత్రిలో అత్యున్నత సేవలందించిన వైద్యులకు జిల్లా కలెక్టరు సి.నాగరాణి చేతుల మీదుగా పురస్కారాలు దక్కాయి. ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా వైద్యశాఖలో కుటుంబ నియంత్రణకు కృషి చేసిన వైద్యులకు ఇచ్చే అవార్డుల్లో భాగంగా తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెలగల అరుణ, ఆస్పత్రిలోని పీపీ యూనిట్ విభాగ వైద్యాధికారి డాక్టర్ బి.దుర్గామహేశ్వరరావులకు బెస్ట్ సర్జన్ పురస్కారాలు దక్కగా, గురువారం భీమవరం కలెక్టరేట్‌లో నిర్వహించిన అవార్డుల ప్రధానోత్సవంలో కలెక్టర్ చేతులమీదుగా ప్రశంసాపత్రాలను అందుకున్నారు.

తణుకు ఆస్పత్రి ప్రత్యేకం..

తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెలగల అరుణ పీపీఐయూసీడీ (లూప్) విధానంలో కుటుంబ నియంత్రణకు అత్యధిక ప్రాధాన్యతనిచ్చిన నేపథ్యంలో ఆమెకు జిల్లా స్థాయి బెస్ట్ సర్జన్ అవార్డు దక్కింది. గర్భిణుల్లో మొదటి కాన్పు తర్వాత బిడ్డకు బిడ్డకు మధ్య రెండు నుంచి మూడు సంవత్సరాలు వ్యవధి ఉండేలా లూప్ విధానంలో జిల్లాలోనే మొదటి స్థానం నిలిచి డాక్టర్ అరుణ ఈ అవార్డును అందుకున్నారు. 150 బెడ్‌లతో వైద్యసేలందిస్తున్న ఈ ఆస్పత్రి రాష్ట్రంలోని 450 పడకలున్న ఆస్పత్రులతో పోటీపడి మొదటి స్థానాన్ని దక్కించుకున్న చరిత్రకల ఆస్పత్రి కావడంతో ఎప్పుడు అవార్డులు ప్రకటించినా తణుకు ఆస్పత్రి కైవసం చేసుకోవడం పరిపాటి. ఆస్పత్రిలో నిత్యం 10 వరకు ప్రసవాలు జరుగుతుండగా 50 మంది వరకు బాలింతలు ప్రసూతి వార్డులో వైద్య సేవలు పొందుతుంటారు. రోజుకు 100 మంది వరకు గర్భిణులు ఆస్పత్రి ఓపీ విభాగంలో వైద్యసేవలు అందుకుంటున్నారు.

హ్యాట్రిక్ సాధించిన డాక్టర్ దుర్గామహేశ్వరరావు

పీపీ యూనిట్ వైద్యాధికారి డాక్టర్ బి.దుర్గామహేశ్వరరావు బెస్ట్ ఫ్యామిలీ ప్లానింగ్ సర్జన్‌గా అవార్డును దక్కించుకున్నారు. తణుకు పీపీ యూనిట్ వైద్యుడిగా వరుసగా మూడు సంవత్సరాలపాటు ఈ బెస్ట్ అవార్డును అందుకోవడం విశేషం. పీపీ యూనిట్ విభాగంలో కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్సలతో పాటు శిశువులకు వ్యాధినిరోధక టీకాలు వేస్తుంటారు. ఈ విభాగంలో డాక్టర్ దుర్గామహేశ్వరరావు నెలలో 50 వరకు కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్సలు చేసి ఈ అవార్డును అందుకున్నారు. అధికశాతం నార్మల్ డెలివరీలకు సంబంధించి కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్సలు జరుగుతుండగా, రెండో కాన్పు అయినప్పటికీ వివిధ కారణాలతో కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్సలు చేయించుకోని వారు ఈ విభాగానికి వచ్చి వైద్యులను కలిసి శస్త్రచికిత్సలు చేయించుకుంటున్నారు. ఇందులో భాగంగా డాక్టర్ దుర్గామహేశ్వరరావు తణుకుతోపాటు నిడదవోలు, తాడేపల్లిగూడెం నియోజకవర్గాల్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వెళ్లి కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్సలు లక్ష్యానికి పైబడి చేస్తున్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తణుకు: పట్టణంలో వార్షిక మరమ్మతుల నిమిత్తం శుక్రవారం తణుకు నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఏడీఈ సీహెచ్ రామకృష్ణ తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు తణుకు పట్టణ పరిధిలోని బ్యాంకు కాలనీ, వేల్పూరు రోడ్డు, సూర్యాలయం వీధి, కొమ్మాయి చెరువు గట్టు, పాతవూరు, ఇరగవరం కాలనీ, జపాన్ కాలనీ, తణుకు మండలంలో వేల్పూరు, కొమరవరం, అత్తిలి మండలంలో అత్తిలి, ఉరదాళ్ల పాలెం, పాలూరుతో పాటు ఇరగవరం గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు చెప్పారు.

తాడేపల్లిగూడెం (టీఓసీ): టూ టౌన్‌లోని (ఎస్ఎస్ పెంటపాడు) సౌత్ సెక్షన్ పరిధిలో సబ్ స్టేషన్ మరమ్మతులు, ట్రాన్స్‌ఫార్మర్ల మార్పులు నిమిత్తం ఈ నెల 12వ తేదీ శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీఈపీడీసీఎల్ ఈఈ తెలిపారు.

అరుణాచల గిరి ప్రదక్షిణకు ప్రత్యేక బస్సులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఏపీఎస్ఆర్టీసీ తాడేపల్లిగూడెం డిపో ఆధ్వర్యంలో ఈ నెల 19వ తేదీన శుక్రవారం రాత్రి 7 గంటలకు అరుణాచల గిరి ప్రదక్షిణ, స్వామి వారిని దర్శించే నిమిత్తం సూపర్ లగ్జరీ వీడియో కోచ్ బయలుదేరనున్నట్లు ఆర్టీసీ డీఎం యేలూరి సత్యనారాయణ మూర్తి వెల్లడించారు. డిపో వద్ద గురువారం డీఎం మాట్లాడుతూ 20వ తేదీ శనివారం ఉదయం శ్రీకాళహస్తి, కాణిపాక విఘ్నేశ్వరస్వామి దర్శనం, అన్నప్రసాదం, అదే రోజు రాత్రి శ్రీపురం శ్రీ మహాలక్ష్మి గోల్డెన్ టెంపుల్ చేరుకుని అమ్మవారి దర్శనం చేసుకుంటారని, 21వ తేదీన ఆదివారం గురుపౌర్ణమి తెల్లవారుజామున అరుణాచలం చేరుకుని, గిరి ప్రదక్షిణ, స్వామి వారి దర్శనం అనంతరం 22వ తేదీ సోమవారం రోజున బస్సు తాడేపల్లిగూడెం చేరుకుంటుందని వెల్లడించారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాలకు కంప్యూటర్ బహూకరణ

తణుకు టౌన్: దాతల సహకారంతో తణుకు మానవత సంస్థ ఆధ్వర్యంలో తణుకులోని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు కంప్యూటర్ సిస్టమ్‌ను బహూకరించారు. గురువారం తణుకులోని ఎస్ఎన్‌వీటీ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో మానవత శాంతి ర్యాలీ చైర్మన్ గమిని రాంబాబు, రాష్ట్ర విస్తరణ అభివృద్ధి కమిటీ కన్వీనర్ డాక్టర్ కే రాధాపుష్పావతి చేతుల మీదుగా హైదరాబాద్‌కు చెందిన అమెరికన్ టెలిఫోన్ అండ్ టెలి కమ్యూనికేషన్ సర్వీసెస్ ఇండియా సంస్థ అందజేసిన కంప్యూటర్ సిస్టమ్‌ను అందజేశారు. ఈ సందర్భంగా రాధాపుష్పావతి మాట్లాడుతూ దాతల సహకారాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు దాతలను ప్రత్యేకంగా అభినందించారు. ఈ ర్యక్రమంలో తణుకు శాఖ అధ్యక్షురాలు కఠారి శారదాదేవి, కార్యదర్శి బొల్లం రామకాశీ, తణుకు మండల చైర్మన్ బోయపాటి రామలక్ష్మీ, కాజ వాణి, కడించర్ల రాజేశ్వరరావు, వంగూరి హనుమంతరావు, కఠారి కాశీవిశ్వనాథరాజు, డాక్టర్ కే రామలక్ష్మీ, ఆకుల శేషుబాబు, జీ వెంకటేశ్వరరావు, కే సత్యనారాయణ, పీ శివన్నారాయణ, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్లను అభివృద్ధి చేయాలి

తాడేపల్లిగూడెం రూరల్: కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం రాష్ట్రంలోని రహదారులకు మరమ్మతులు చేసి, అభివృద్ధి చేయాలని సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు చింతకాయల బాబూరావు డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని ఇటుకులగుంట గ్రామంలో కండెల్లి సోమరాజు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బాబూరావు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో రహదారుల అభివృద్ధి జరగలేదని, ఎక్కడ చూసినా రోడ్లు అధ్వానంగా ఉన్నాయన్నారు. దీంతో వాహనదారులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్ల అభివృద్ధి కోసం స్థానిక ఎమ్మెల్యే చేస్తున్న కృషిని అభినందించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కమిటి కన్వీనర్ పాలుపూరి సత్యనారాయణ, మండల కమిటి సభ్యులు పూరెల్ల సుబ్బారావు, సిద్దాబత్తుల నాగేశ్వరరావు, పురిటిగడ్డ జయమ్మ పాల్గొన్నారు.

విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను ఉపసంహరించుకోవాలి


తణుకులో నిరసన ప్రదర్శన నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

తణుకు: విశాఖ ఉక్కును ప్రైవేటుపరం చేయడాన్ని కేంద్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పీవీ ప్రతాప్ డిమాండ్ చేశారు. గురువారం తణుకులోని స్థానిక వెంకటేశ్వర థియేటర్ సెంటర్ వద్ద సీపీఎం ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతాప్ మాట్లాడుతూ విశాఖ ఉక్కు పరిశ్రమ అమ్మడాన్ని ఆపకపోతే ఆందళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు గార రంగారావు, కామన మునిస్వామి, బళ్ల చినవీరభద్రం, గుబ్బల గోపి, పి.రాజు, కె.వీర్రాజు, వంశీ, శ్రీను, లక్ష్మిణ్, వెంకటనారాయణ, శ్రీనివాసరాజు తదితరులు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం (టీఓసీ): విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని అమ్మకానికి పెట్టి రాష్ట్రానికి తీరని ద్రోహం చేస్తున్నారని కార్మిక నాయకలు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రైవేటీకరణను నిరసిస్తూ సీపీఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో గురువారం స్థానిక పోలీస్ ఐలాండ్ వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. సీపీఎం పట్టణ కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు, సీఐటీయూ పట్టణ కార్యదర్శి కరెడ్ల రామకృష్ణలు మాట్లాడుతూ 32 మంది ప్రాణ త్యాగాలతో సాధించుకున్న విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ అమ్మకానికి పెట్టి మోదీ, చంద్రబాబు రాష్ట్రానికి తీరని అన్యాయం చేయాలని చూస్తున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

హోటళ్లలో తనిఖీలు

తాడేపల్లిగూడెం: పట్టణంలోని పలు హోటళ్లపై జిల్లా ఫుడ్ ఇన్స్‌పెక్టర్ సుందర్‌రామిరెడ్డి గురువారం ఆకస్మికంగా తనిఖీలు చేశారు. నిబంధనలు పాటించని యజమానులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.